క్లుప్తంగా

గుమ్మిడివరంలో 104 సేవలు

సీతానగరం: 104 సంచార వైద్య కేంద్రం ద్వారా అందిస్తున్న సేవలను రోగులు వినియోగించుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ పి.ఉషారాణి అన్నారు. మండలంలోని గుమ్మిడివరంలో 104 కేంద్రం ద్వారా 48 మంది రోగులకు శనివారం వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. హెల్త్ సూపర్‌వైజర్, ఏఎన్‌ఎం, 104 సిబ్బంది పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత



యోగాసనాలు వేస్తున్న అధికారులు, సిబ్బంది

సాలూరు: యోగాతో మానసిక ప్రశాంతత సాధ్యమని మున్సిపల్ కమిషనర్ కృష్ణారావు అన్నారు. యోగాంధ్ర కార్యక్రమాన్ని పట్టణంలో వెంకటేశ్వర కల్యాణ మండపం వద్ద శనివారం నిర్వహించారు. పలువురు ప్రత్యేక యోగాసనాలు వేసి వాటి ఆవశ్యకతను వివరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మనిషి జీవనంలో యోగాకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. యోగా ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డా.శివకుమార్, యోగా గురువులు, మున్సిపల్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

అధిక రక్తపోటు నివారణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

జియ్యమ్మవలస రూరల్: ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని జియ్యమ్మవలస ప్రాథమిక ఆరో గ్య కేంద్రం(పీహెచ్‌సీ) వైద్యాధికారి పి.జగదీష్ సూచించారు. ప్రపంచ అధిక రక్తపోటు నివారణ దినోత్సవంలో భాగంగా మండల కేంద్రంలో పీహెచ్‌సీ పరిధిలో శనివారం అవగాహన ర్యాలీ నిర్వ హించారు. ఈ సందర్భంగా అధిక రక్తపోటుకు కారణాలు, నివారణ చర్యలను వైద్య సిబ్బంది తెలిపారు. మనం రోజువారీ తీసుకునే ఆహారంలో జాగ్రత్తలు పాటించాలని, ప్రతిరోజూ పౌష్టికాహారం తీసుకునేలా ఉండాలన్నారు. రక్తపోటు మనిషిలో అంతర్గత శత్రువుగా మెలుగుతూ ఒక్కసారిగా మని షి మరణానికి కారణమవుతుందన్నారు.

జమదాలలో అగ్ని ప్రమాదం



అగ్ని ప్రమాదంలో కాలిన ఇల్లు

పార్వతీపురం రూరల్: మండలంలోని జమదాల గ్రామంలో శనివారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో పెద్ద వీధిలో ఉన్న జాగాన నాగేశ్వరరావు, చిన్నమ్మలకు చెందిన ఇళ్లు కాలిపోయాయి. వీరి ఇళ్లల్లో వెలిగించిన దీపం ప్రమాదానికి కారణంగా భావిస్తున్నట్టు అగ్ని మాపక అధికారి ప్రభాకరరావు తెలిపారు. ప్రమాద సమాచారం తమకు అందడంతో వెంటనే గ్రామానికి చేరుకొని మంటలను అదుపు చేసినట్టు చెప్పారు. ప్రమాదంలో ఆస్తి నష్టం అంచనా వేస్తున్నట్టు తెలిపారు. పార్వతీపురం రూరల్ ఎస్‌ఐ బి.సంతోషికుమారి ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.

వైభవంగా సింహాద్రి అప్పన్న సంబరాలు

వీరఘట్టం: మండలంలోని నడుకూరులో రెండు రోజులుగా నిర్వహిస్తున్న సింహాద్రి అప్పన్న సంబరాలు వైభవంగా సాగాయి. లెంక వంశీకులు నిర్వహించిన ఈ సంబరాల్లో శనివారం ఏర్పాటు చేసిన తప్పెటగుళ్ల, హరికథ ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి. మహిళలు ఊరేగింపుగా వచ్చి స్వామి వారికి పూజలు చేశారు. సంబరాలను తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో రావడంతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది.



రేషన్ కోసం మళ్లీ పడిగాపులు!

- జూన్ 1 నుంచి రేషన్ దుకాణాల వద్ద సరుకుల పంపిణీ
- రోజంతా నిరీక్షణ తప్పదా?
- కార్డుదారుల్లో ఆందోళన

బలిజిపేట:

ఇంటింటికీ రేషన్ సరుకుల పంపిణీ కార్యక్రమానికి రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం మంగళం పాడింది. డబ్బా తూకాలకు మళ్లీ తెర తీసింది. జూన్ ఒకటి నుంచి మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్(ఎండీయూ) ద్వారా రేషన్ సరుకుల పంపిణీని ప్రభుత్వం రద్దు చేసింది. దీంతో రేషన్ కార్డుదారులు సరుకుల కోసం మళ్లీ రేషన్ దుకాణాలకు ఉదయం, సాయింత్రం వేళల్లో వెళ్లి పడిగాపులు పడాల్సిన పరిస్థితులు ఎదురు కానున్నాయి. ఇప్పటికే వలంటీర్ వ్యవస్థను తొలగించడంతో పౌర సేవల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న ప్రజలు జూన్ నుంచి రేషన్ షాపుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితులు ఎదురయ్యాయి. గత ప్రభుత్వంలో ప్రజలు సరుకుల కోసం షాపుల వద్ద పడిగాపులు పడాల్సిన అవసరం లేకుండా దేశంలో ఎక్కడా లేని విధంగా ఇంటికే సరుకులు అందించేలా చర్యలు చేపడితే కూటమి ప్రభుత్వం దానిని రద్దు చేసి ప్రజలను కష్టాల ఊబిలోకి, వారు మోసపోయే విధంగా నెడుతున్నదనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి.



రేషన్ షాపుల్లో డబ్బాలతో కొలుస్తున్న బియ్యం (ఫైల్)

రేషన్ షాపుల వద్ద పడిగాపులు తప్పవా!

రేషన్ షాపుల వద్ద సరుకులు తెచ్చుకునేందుకు గతంలో షాపుల వద్ద మహిళలు, వృద్ధులు పడిగాపులు పడేవారు. క్యూలు కట్టేవారు, డీలరుకు ఖాళీ అయిన సమయాల్లో సరుకులు ఇచ్చేవారు. కొన్ని రేషన్ షాపులు చిన్న చిన్న గదులు ఉండడంతో కార్డుదారులు బయట వేలిముద్రలు వేస్తే లోపల బియ్యం తూకాలు జరిగేవి. కార్డుదారులకు సక్రమంగా సరుకులు అందేవి కావు. కార్డుదారులు తెచ్చే బస్తాలతో తూకాలు వేయకుండా ఎక్కువగా డబ్బాలతో బియ్యాలు తూకాలు వేయడం జరుగుతుండేది. ఒక ఖాళీ ఆయిల్ డబ్బా 750గ్రాములు ఉంటుంది. దీంతో బియ్యాలు తూకాలు వేస్తుంటారు. డబ్బా బరువుతో కలిపి డిజిటల్ కాటాపై బరువు కనిపిస్తుంది. ఈ లెక్కన ఎన్ని పర్యాయాలు డబ్బాతో తూకం వేస్తే అన్ని 750గ్రాముల బియ్యం కార్డుదారులకు నష్టం జరుగుతుంది. రద్దీగా ఉండే సమయంలో చీకటి గదిలో ఈ విధంగా తూకాలు వేసిన డీలర్లు ఉండేవారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఎండీయూ వాహనాలు వచ్చిన తరువాత వాహనంలో నేరుగా కళ్ల ఎదుటే బియ్యం తూకాలు జరిగేవి. కార్డుదారులకు కాళ్ల వద్దకు, ఒక్క బియ్యపు గింజ నష్టపోకుండా బియ్యాలు అందేవి. ఇప్పుడు ఈ సేవకు స్వస్తి పలికింది కూటమి ప్రభుత్వం.

2027వరకు ఒప్పందం ఉన్నా..

వాస్తవంగా 2027 వరకు ప్రభుత్వం చేసుకున్న ఒప్పందం అమలులో ఉన్నప్పటికీ ప్రస్తుత ప్రభుత్వం దీనిని రద్దు చేయడంతో ఎండీయూ వాహనదారులు జీవనోపాధి కోల్పోయి నడిరోడ్డున పడ్డట్టయింది. మండలంలో 12మంది ఎండీయూ వాహనదారులు ఉన్నారు. వీరి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. బలిజిపేట మండలంలో 44 రేషన్ దుకాణాలు ఉండగా, రేషన్ కార్డుదారులు 19,370 మంది ఉన్నారు.

ఇంటింటికి సరుకుల పంపిణీతో మేలు

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన ఇంటింటికి సరుకుల పంపిణీతో ప్రజలు అవస్థలు పడకుండా వారి ఇంటి వద్దకే సరుకులు అందేవి. తూకాలు కచ్చితంగా జరిగేవి. ఇప్పుడు మరల రేషన్‌షాపుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన పరిస్థితులు కూటమి ప్రభుత్వం తెచ్చింది.

– సత్యంనాయుడు, బలిజిపేట

కొందరికి మాత్రమే డోర్ డెలివరీ

65 సంవత్సరాలు దాటిన వారికి, మంచం మీద ఉండి లేవలేని స్థితిలో ఉన్న వారికి మాత్రమే ఇంటికి సరుకులు పంపిణీ చేయాలని సూచించారు. అన్ని షాపుల మీద పర్యవేక్షణ ఉంటుంది.

– రమేష్‌బాబు, సీఎస్‌డీటీ, బలిజిపేట

తుఫాన్ వరద సహాయ కార్మికులను విస్మరించడం సరికాదు



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

పార్వతీపురం టౌన్: విజయవాడ తుఫాన్ వరద బాధితుల సహాయం కోసం వెళ్లిన మున్సిపల్ పారిశుధ్య కార్మికులను తొమ్మిది నెలలు గడిచినా నేటికీ పట్టించుకోకపోవడం అన్యాయమని సీఐటీయూ జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ అన్నారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లుకు మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సీఐటీయూ నాయకులు కార్మికులు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 సెప్టెంబర్ నెలలో విజయవాడలో సంభవించిన వరద ముప్పు వల్ల పారిశుధ్య చర్యలు కోసం పార్వతీపురం మున్సిపాలిటీ నుంచి 20 మంది కార్మికులు వెళ్లి 8 రోజుల పాటు విజయవాడ సుందరీకరణలో భాగస్వాములయ్యారని తెలిపారు. దీనికి ప్రతిగా కార్మికులకు రెండు జతల దుస్తులు నిమిత్తం డబ్బులు మంజూరైనట్టు అధికారులు తెలిపారని, అయితే వాటిని నేటికీ ఎందుకు చెల్లించలేదని ప్రశ్నించారు. వెంటనే స్పందించి కార్మికుల దుస్తుల నిమిత్తం విడుదలైన సొమ్మును చెల్లించాలని, అలాగే టీఏలు, డీఏలు, విజయవాడకు రానుపోను ప్రయాణ చార్జీలు కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. వినతిపత్రం అందజేసిన వారిలో మున్సిపల్ పారిశుధ్య కార్మికులు ఎస్.మల్లేసు, జి.గుంపస్వామి, ఎం.విద్యాసాగర్, ఎస్.శ్రీను, సీఐటీయూ నాయకుడు పి.రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

చెత్త నుంచి సంపద సృష్టిపై అవగాహన

బలిజిపేట: చెత్త నుంచి సంపద సృష్టిపై ఇంచార్జ్ ఎంపీడీవో పుష్పారావు కార్యదర్శులకు శనివారం అవగాహన కల్పించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బలిజిపేట చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద అవగాహన కల్పించారు. గ్రామంలో గ్రీన్ అంబాసిడార్ల ద్వారా ఏ విధంగా చెత్తను సేకరించాలి, తెచ్చిన చెత్తను ఏ విధంగా వేర్వేరు చేసి నాడెప్పలలో దానిని వేసి సంపద తయారీ చేయాలనేది వారికి వివరించారు. తయారైన సంపదను రైతులకు, అవసరమైన వారికి విక్రయించాలన్నారు. కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.



బలిజిపేటలో అవగాహన కల్పిస్తున్న ఇంచార్జ్ ఎంపీడీవో

సీతానగరంలో..

సీతానగరం: గ్రామ పంచాయతీల అభివృద్ధికి చెత్త నుంచి సంపద తయారు చేయాల్సిన అవసరం కార్యకర్తలపై ఉందని డిప్యూటీ ఎంపీడీవో కె.కుమారవర్మ అన్నారు. స్వచ్ఛాంధ్రప్రదేశ్‌లో భాగంగా శనివారం స్థానిక ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రంలో శనివారం పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పించారు. గ్రీన్ అంబాసిడర్లు సేకరించిన తడి, పొడి చెత్త నుంచి వర్మీ కంపోస్టు ఎరువు తయారు చేసి విక్రయించిన ఆదాయంతో పంచాయతీలకు వినియోగించాలని సూచించారు.

యోగా మన ప్రాచీన సంస్కృతి



యోగా శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న డీఎంహెచ్‌వో భాస్కరరావు

పార్వతీపురం టౌన్: యోగాతో ప్రతీ ఒక్కరు సంపూర్ణ ఆరోగ్యవంతులవుతారని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు పేర్కొన్నారు. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా మే 21 నుంచి నెల రోజుల పాటు వివిధ యోగా కార్యక్రమాలను నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించినట్టు చెప్పారు. ఈ క్రమంలో శనివారం స్థానిక ఎన్‌జీవో హోమ్‌లో 50 మంది వైద్య ఆరోగ్య సిబ్బందితో యోగా కార్యక్రమం నిర్వహించారు. ఢిల్లీ నుంచి విచ్చేసిన యోగా గురువు డా.నితిన్ నేతృత్వంలో వర్చువల్ విధానంలో మాస్టర్ ట్రైనీలకు ఇచ్చిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జూన్ 21 వరకు యోగాంధ్రా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించిందని తెలిపారు. అందులో భాగంగా ఈ రోజు యోగాలో మాస్టర్ ట్రైనీలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతోందన్నారు. యోగా మన ప్రాచీన సంస్కృతి, యోగా చేయడం వల్ల మానసిక ఒత్తిడి నుంచి ప్రశాంతత లభిస్తుందని తెలిపారు. శనివారం పాలకొండ, సాలూరులో కూడా సుమారు 60మంది మాస్టర్ ట్రైనీలకు శిక్షణ ఇవ్వడం జరుగుతోందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్మోహన్‌రావు, జిల్లా ఆయుష్ శాఖ అధికారి సుశీల, యోగా గురువు మోహన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం రేపు

పార్వతీపురం రూరల్: కొత్తగా ఏర్పాటు చేస్తున్న విద్యుత్ లైన్లు, నర్సిపురం సబ్‌స్టేషన్‌లో కొత్తగా బ్రేకర్ పనుల నిమిత్తం మండలంలోని 11 కేవీ నర్సిపురం ఫీడర్, 11 కేవీ ఎంఆర్‌నగరం ఫీడర్, 11 కేవీ బందలుప్పి ఫీడర్ల ద్వారా విద్యుత్ సరఫరా అవుతున్న ప్రాంతాల్లో సోమవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్టు విద్యుత్ శాఖ ఏఈ రామారావు శనివారం తెలిపారు. వైకేఎం పంచాయతీ, నర్సిపురం, బందలుప్పి, చినబొండపల్లి, ఎంఆర్ నగరం, సంగంవలస, చందలింగి, ఎల్ఎన్‌పురం, చినమరికి, పెదమరికి, రావికోన బట్టివలస, పెదబొండపల్లి, పుట్టూరు, సూడిగాం గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనున్నట్టు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

గిరిజన గురుకులాల్లో ఇంటర్మీడియట్ సీట్లు పెంచాలి

పార్వతీపురం: ఐటీడీఏ పరిధిలో ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల కళాశాలలో ఇంటర్మీడియట్ సీట్లను పెంచాలని గిరిజన విద్యార్థి సంఘం నాయకులు పల్లా సురేష్ శనివారం కోరారు. రానున్న విద్యా సంవత్సరంలో సీట్లు తక్కువ కారణంతో ఇప్పటికే దరఖాస్తులు చేసుకున్న విద్యార్థులు సీట్లు సంఖ్యకు మించి అధికంగా ఉండడంతో అవకాశాలు లేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఈ మేరకు బాలురు, బాలికలకు ఇంటర్మీడియట్ విద్య కళాశాలలను అదనంగా ఏర్పాటు చేసి సీట్లు పెంచాలని కోరారు.

ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

వీరఘట్టం: ప్రతి వారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు వచ్చిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని జేసీ శోభిక ఆదేశించారని తహసీల్దార్ చందక సత్యనారాయణ తెలిపారు. శనివారం జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ మాట్లాడుతూ.. పలు సమస్యలపై దిశానిర్దేశం చేసిందని చెప్పారు. అలాగే రేషన్ కార్డుల దరఖాస్తుల పరిశీలన, రీ సర్వే, తదితర అంశాలపై మాట్లాడినట్లు తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో స్థానిక రెవెన్యూ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

సువర్ణముఖీ నదిపై బ్రిడ్జి నిర్మాణ పనులు



సువర్ణముఖీ నదిలో వేస్తున్న డ్రిల్స్

సీతానగరం: మండలంలోని సువర్ణముఖీ నదిపై బూర్జ వద్ద బిడ్జి నిర్మాణానికి జరుగుతున్న ప్రాథమిక పనుల్లో భాగంగా పిల్లర్లు నిర్మించేందుకు వీలుగా డ్రిల్ పనులు చేస్తున్నట్టు పీఆర్ ప్రాజెక్ట్స్ ఏఈ జి.శంకరరావు తెలిపారు. బూర్జ రేవులో సువర్ణముఖీ నదిలో తీస్తున్న డ్రిల్ బోర్లును ఆయన శనివారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నదిలో చినంకలాం రేవు నుంచి పాతబూర్జ రేవుకు మధ్య తొమ్మిది పిల్లర్లు నిర్మాణ స్థలాల్లో పాతబూర్జ నీలాటి రేవులో చినంకలాం – గాదెలవలస రోడ్డును అనుసంధానం చేస్తూ బ్రిడ్జి నిర్మాణానికి డ్రిల్ పనులు జరుగుతున్నాయని చెప్పారు. ఇప్పటికే ఐదు డ్రిల్స్ వేసినట్టు వెల్లడించారు. 2023 – 24 ఆర్థిక సంవత్సరంలో నాబార్డు ఆర్ఐడీఎఫ్ నిధులతో అప్పట్లో బ్రిడ్జి నిర్మాణ పనులకు అనుమతులు రావడంతో ప్రాథమికంగా డ్రిల్స్ వేస్తున్నట్టు తెలిపారు.

కంకర తేలి.. గుంతల మయమై...

పాచిపెంట మండల కేంద్రం నుంచి కుంతాంకు వెళ్లే సుమారు ఐదు కిలో మీటర్ల బీటీ రోడ్డు కంకర తేలి గుంతల మయమైంది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారిలో సుమారు పది గిరిజన గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. రాత్రి సమయాల్లో ఈ మార్గంలో ఎక్కువగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

– పాచిపెంట



గ్రామ స్థాయిలో ప్రకృతి వ్యవసాయ ప్రణాళికలు



ప్రకృతి సేద్య రైతులకు సన్మానం చేస్తున్న ఏవో

పాచిపెంట: గ్రామ స్థాయిలో ప్రకృతి వ్యవసాయ ప్రణాళికలు సిద్ధం చేయాలని ఏవో కొల్లి తిరుపతిరావు అన్నారు. మండలంలోని మాతమూరు గ్రామంలో శనివారం ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ ఖరీఫ్ ప్రణాళిక సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సత్వర సేవలను అందించి రైతులను ప్రకృతి వ్యవసాయం దిశగా మళ్లించాలన్నారు. ముఖ్యంగా వరి, కూరగాయల పంటలపై దృష్టి సారించి పూర్తి స్థాయిలో ప్రకృతి సేద్యం చేసే దిశగా ప్రణాళికల రూపొందించాలన్నారు. అనంతరం ప్రకృతి వ్యవసాయం సాగు చేసే రైతులను సన్మానించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ముఖి సూర్యనారాయణ ఎక్సైజ్ సీఐ నరసింహామూర్తి పలువురు ప్రకృతి సేద్య రైతులు పాల్గొన్నారు.

యార్డు ఉన్నా ఫలితం సున్నా..

- నిరుపయోగంగా మార్కెట్ యార్డు స్థలం
- సీఎస్పీ రోడ్డు పక్కనే ఉన్న 6.5 ఎకరాల భూమి
- దీని విలువ సుమారు రూ.30 కోట్లు
- లీజుకు ఇస్తే ప్రతీ నెలా ప్రభుత్వానికి రూ. లక్షల్లో ఆదాయం
- ఎవరూ పట్టించుకోకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన వైనం

వీరఘట్టం: రైతుల ప్రయోజనం కోసం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల పక్కన, సీఎస్పీ రోడ్డుకు ఎదురుగా నిర్మించిన మార్కెట్ యార్డు మూడు దశాబ్దాల కాలంగా నిరుపయోగంగా ఉంది. ఈ స్థలాన్ని లీజుకు ఇచ్చినా లేదా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించినా ప్రతి నెలా రూ.లక్షల్లో ప్రభుత్వాని కి ఆదాయం వచ్చే అవకాశం ఉంది. అయితే ఎవరూ పట్టించుకోకపోవడంతో రాత్రి వేళ అసాంఘిక కార్యకలాపాలకు ఆవాసంగా మారింది. 30 సంవత్సరాల కిందట రూ.8 లక్షల (ప్రస్తుతం విలువ సుమారు రూ. 30 కోట్లు) వ్యయంతో 6.5 ఎకరాల విస్తీర్ణంలో వ్యవసాయ మార్కెట్ యార్డ్ నిర్మించా రు. రెండు గోదాంలు, విశాలమైన రెండు రేకుల షె డ్లు, పంటలను ఆరబెట్టుకునేందుకు మరో రెండు షెడ్లులు నిర్మించారు. ప్రస్తుతం ఈ షెడ్లులు, ఖాళీ స్థలం మార్కెట్ యార్డులో నిరుపయోగంగా మారాయి.



నిరుపయోగంగా ఉన్న మార్కెట్ యార్డు గోదాములు

మూడు రోజుల ముచ్చటగా...

ప్రజల కోరిక మేరకు 13 ఏళ్ల కిందట ఇక్కడ వారపు సంత ఏర్పాటు చేశారు. అయితే ఈ సంతను కొనసాగించడంలో అధికారులు విఫలమయ్యారు. దీంతో దళారులు చాపకింద నీరులా వ్యవహరించి సంతను నిర్వీర్యం చేశారు. ఇక్కడ ఏర్పాటు చేసిన సంత మూడు రోజుల ముచ్చటగా ముగిసింది. వీరఘట్టం మండలం కాయగూరలు, ఇతర పంటలకు ప్రసిద్ధి. ఈ ప్రాంతంలో పండుతున్న అరటి, మొక్కజొన్న, కాలీఫ్లవర్, క్యాబేజీ, టమాటా, దొండ, బెండ, క్యాబేజీ, క్యారెట్, తదితర పంటలకు ఇతర ప్రాంతాల్లో ఎంతో గిరాకీ ఉంది. స్థానికంగా విక్రయించేందుకు మార్కెట్ సదుపాయం లేకపోవడంతో దళారుల ప్రమేయం అధికంగా కనిపిస్తోంది.

నిరుపయోగం....

ప్రస్తుతం మార్కెట్ యార్డ్‌లో ఉన్న రెండు గోదాములు నిరుపయోగంగా మారాయి. బయట వ్యక్తులకు అద్దెకు ఇచ్చినా రూ.లక్షలో ప్రభుత్వానికి ఆదాయం వచ్చేది. గత టీడీపీ హయాంలో గోదాంల మరమ్మతులకు రూ.లక్షలు ఖర్చు చేశారు కాని ఉపయోగంలోకి మాత్రం తీసుకురాలేదు. మెయింటినెన్స్ పేరిట నిధులు వృథా అవుతున్నాయే తప్ప ప్రభుత్వానికి, రైతులకు ఈ గోదాముల వల్ల ఎటువంటి ఉపయోగం లేదు. మార్కెట్ యార్డ్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.



సీఎస్పీ రోడ్డు పక్కన ఖాళీగా ఉన్న విలువైన మార్కెట్ యార్డ్ స్థలం

జోరుగా ఆక్రమణలు....

ప్రభుత్వ స్థలం కావడంతో అడిగే నాథుడు లేకపోవడంతో కొంతమంది ఆక్రమించుకుని షెడ్లు ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు చేస్తున్నారు. ఇంకొందరు ఆక్రమించుకున్న షెడ్డులను అద్దెలకు ఇచ్చుకుని దర్జాగా దర్పం చెలాయిస్తున్నారు. ప్రభుత్వ స్థలంలో వేసిన షెడ్డులకు ఎటువంటి ఆధారాలు లేకపోయినా విద్యుత్ శాఖాధికారులు ఎలా మీటర్లు మంజూరు చేశారో అర్థం కావడం లేదు.

చందాల చిట్టా విప్పేదెప్పుడు..!

సాలూరు: పట్టణంలో శ్యామలాంబ పండగ ముగిసింది. పండగ రోజుల్లో కరెంట్ లేక తీవ్ర ఇబ్బందులు పడి రోడ్డెక్కిన ప్రజల ఆగ్రహ జ్వాలలు చల్లబడ్డాయి. దీనితో ఇప్పుడు అమ్మవారి పండగకు వచ్చిన విరాళాలు, వాటి ఖర్చుల లెక్కలపై ప్రజలు విస్తృతంగా చర్చించుకుంటున్నారు. ఉత్సవ కమిటీ పెద్దలు ఈ లెక్కల చిట్టాను ఎప్పుడు విప్పుతారు, ఆ ఖర్చులు వివరాలు ఎంత పారదర్శకంగా ఉంటాయోనని పట్టణ వాసులు ఆతృతగా ఎదురు చూస్తున్నారు. 15 ఏళ్ల తరువాత జరిగిన అమ్మవారి పండగ కావడంతో సుమారు కోటి రుపాయిల వరకు భక్తుల నుంచి చందాలు వచ్చి ఉంటాయని ప్రజలు అంచనా వేసుకుంటున్నారు. సాధారణంగా రాజకీయాలకు, పార్టీలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలతో ఉత్సవ కమిటీ ఏర్పాటు చేయాల్సి ఉండగా అమ్మవారి ఉత్సవ కమిటీ దానికి విరుద్ధంగా మంత్రి సంధ్యారాణి కనుసన్నల్లో ఆమె అనుయాయులతో ఏర్పాటు చేశారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.